



# చివరకు ప్లీడరీ

దామాగోవిందరావు

శరభయ్య మ్రొక్కిన మ్రొక్కులూ శరభమ్మ నూచిన నోములూ, ఫలించా యన్నట్టుగా చవితి పూట ధనిష్ఠా నక్షత్రాన్ని వంశభాస్కరు డ్లాంటి సుపుత్రుడు దయించేడు దంపతులకు. శరభయ్యకు మితి లేని ఆనందం. శరభమ్మకు ఇక పుత్రుడే లోకము.

కాస్త కాళ్లు వచ్చేసరికి శరభయ్య పొలం వెళ్తూన్నప్పుడు వెంట బడి వెళ్ళి, గట్టు మీద కూర్చొని, సేద్యగాళ్ళందర్నీ "త్వరత్వరగా చేయం డప్పాపనీ, వెధవ పని న్నెనెతేనా?" అంటూ అదమాయించేవాడు, వచ్చీ రానిమాటల్తో పెంచలరావు. శరభయ్య వీడి వాలకం చూసి "బాబూ, ఇప్పట్నుంచీ యెందుకులే! రేపు, జమీందారు. వయ్యాక అథార్టీ చెలాయిద్దువు గాని" అంటూ, లోపల తన కుఱ్ఱ కనీసం యే ముఖాసాదారన్నా అవుతాడని, అను కొనే వాడు.

హైస్కూలు ప్రవేశించాడు పెంచల్రావ్. ఫుట్ బాల్ హాకీ, ఆటల్లో యోధుణ్ణ నిపించాడు. మోకాళ్ళు విరుగ్గొట్టుకునీ, ముక్కు చెదర గొట్టుకునీ వచ్చే వాడు ఇంటికి. శరభమ్మకు మాత్రం, రోజూ సున్నం చింత పండూ పుడికించే వంతు తప్పేది గాదు. శరభయ్య తన కొడుకు వికారరూపం జూసి పైకి చివాట్లు పెట్టూ, లోపల తన కొడుకు SPORTING CARRIER ఆనం దిస్తూ, అథవా ఏ సర్కిల్ ఇన్స్పెక్టరన్నా అవుతాడని వాడి నిపుణత్వాన్ని తలుచుకొంటూ, పరవశు డయి పోయే వాడు.

స్కూలు ఫైనలు చదువు తున్నాడు పెంచల్రావు. ఇంగ్లీషులో నూటికి. యాభై. లెక్కలు సెంట్ పర్ సెంట్! స్కూలు బహుమతులు గూడా కొన్ని పొందాడు. శరభయ్యతో, కొందరు టీచర్లు గూడా "మీ వాడు తెలివి కల ఘటం చులాగ్గా దాటేస్తాడు తే మెట్టూ,—అన్నట్టు మీ వాణ్ణి ఇంజినీరింగు లైన్లో, ప్రవేశ పెట్టండి." అని సలహా లిచ్చారు. శరభయ్య, తన కొడుకు తెలివికి సంతోషిస్తూ "వెంకటాపురం వంతెన మా వాడి చేతుల్లో కట్టూంటే చూసి పోవాల ని వుందని తన అంత్య అభిలాష తన బంధు వర్గాని కంతటికీ చెప్పుతూండే వాడు.

స్కూలు ఫైనలు పాసై, ఇంటర్మీడియేటు చదువు తోన్నాడు పెంచలం కాకినాడలో. వృక్షశాస్త్రం జంతుశాస్త్రం, ఆప్షనల్సుగా తీసు కొన్నాడు. క్రమంగా ఆశాస్త్రాల్లో మేధావి నని పించుకొన్నాడు. శరభయ్య మాత్రం తన కొడుకు ఏఫారెస్టు ఆఫీసరో అవుతాడను కొంటూ "నాకేం తక్కువ? ఈ పాత ఇల్లు పీకి, యేడు దర్వాజాల మహల్ కట్టాను కానీ ఖర్చు లేకుండా అని, పలవరిస్తూ "సుపుత్రా! అయ్యే అడవీ శాఖ ఆఫీసరు వవుతానే వున్నావ్, జోడుగుండ్ల తుపాకీ

ర.విళ్ళ

మాత్రం ఒకటి కొనుక్కో! పులీపుట్రా వుంటుంది, వెధవ అడ్వులు! నమ్మరాని కాలం! పొద కదిలిందంటే, ప్రేల్చు సుమా!" అని ఉత్తరం వ్రాశాడు కాకినాడ.

పెంచలం నాలుగు సెప్టెంబర్లు చూసి, ఇంటర్మీడియేటు పేసయ్యాడు. వెంటనే అటవీ శాఖ పరీక్షకు వెళ్ళాడు. నడక పరీక్షలో [Walkiug Testలో] కాళ్ళు బార జాపినాడు. ఇక ఫలితం లేదని బి. ఎ. పరీక్షకు చదివి, రెండేళ్ళలో పట్టభద్రుడ య్యాడు.

రోజూ "హిందూ" పేపరు కొనడం. "Wanted colmn" "కావలెను" చదవడం. ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం, పని. చేకూరిం దేమిటంటే— కాగితాలు దండుగ; కవర్లు దండుగ; జేబులో డబ్బులు దండుగ. చేసిన కష్టం దండుగ; ఒంట్లో సత్తువ దండుగ; అంతా వెట్టి చాకిరీ! అరవ నౌఖరీ.

ఊరికే వుంటే యేముందని, పటాలంలో చేరడానికి ప్రయత్నించాడు. ఎత్తు చాల దన్నారు ప్రభువులు. ఎత్తు కావాలంటే—నిట్ట నిలువుగా వ్రేలాడాలి. కొంపదీసి, ముడి మెడకు బిగిసెదంటే; అపాయం! ఆయుక్షీణం గూడా ననీ, స్వస్తి చెప్పాడు. పెంచ్రలావుకు మొదట్నుంచీ "రక్షకభటుడైతే బాగుంటుంది. దేశ సంరక్షణన్నా చెయ్యొచ్చును లాఠీ దీసుకొని" అనే ఓ తలంపు ఉండేది. తదనుగుణ్యంగా పోలీసు వుద్యోగానికి ధర కాస్తు పంపాడు. వారూ, "తమకు ఛాతీ చాల్దని" తెలియ జేశారు. అదెంతపనని, పెంచలు "శాండో డంబెల్సు" రెండు కొని పగలూ రాత్రీ అనకుండా, సాధన చేశాడు. వారం రోజుల కల్లా అధిక వేడి చేసి, ఆర్నెల్లు మంచ మెక్కాడు. ఛీ! గవర్నమెంటు పనంత అసహ్యం యేమీ లేదని, అక్కడా ఇక్కడా యెందు కనిన్నీ, పట్నం వెళ్ళి, అక్కడ పని వెదకడం ప్రారంభించాడు.

ఎక్కడికి వెళ్ళినా, "పట్టభద్రు లెవరికి కావాలి? యస్. యస్. యల్. సీ లూ, సాంబార్ కూట్లూ చాలా చవుకగా వుంటేను" అనే వారే గాని పట్టుమని పని చేయించుకుని, పది రాళ్ళిస్తా ననే పుణ్యాత్ము డెవ్వడూ, కన్పించ లేదు. ఇదేమీ బాగుండలేద ని సర్వీస్ కమీషన్ పరీక్షకు వెళ్ళాడు. గ్రహపాట్లో పొరపాటు జరిగింది. పుల్లాసీదా అయిపోయి తిన్నగా టీచరు పని కోసం హెడ్ మాష్టర్లని పట్టేడు. వారూ, యల్. టి. లకే ఛాన్సు గాని వట్టి "బి. ఎ." లకూ ఛాన్సు లేదన్నారు. పోనీ, ట్రయినింగ్ కాలేజీలో ప్రవేశి ద్దామని వెళ్ళాడు గాని అక్కడా రెండేళ్ళు ఏస్కూల్లో నైనా, ప్రాక్టిస్ లేందే చదవడానికి గూడా వీలు లేదన్నారు, చివరికి లంచ మిచ్చుయినా సరే!

ప్రాణం విసిగి, పెంచ్రలావ్ పోతున్నాడు పార్కులోను గుండా. అక్కడ "ఓ గుమాస్తాగిరి ఖాళీ" అని వ్రాసి వుంది. లోపలి కెళ్ళాడు. ఓ హూణాణ పడుచు యెదురు గుండా వచ్చి "ఏం?" అంది. "పైని వ్రాసి వున్న బల్ల. నేను బి.ఎ... ఉద్యోగం కోసరం" అన్నాడు తత్తర పాటుతో, లభించింది గదా అనే ఆనందం పట్ట లేక. "మీకు పెండ్లయిందా?" అంది, ఆ శ్వేతభామ. "లేదు" అన్నాడు, నెమ్మదిగా. "బ్రహ్మచారులా?" అంది, పెదవి విరచి. "అవును" అని జవా బిచ్చాడు. "అవుసరం లేదు." అంది. "గుడ్ బై" అన్నాడు. "వెరీ" అంద, త్రోవ జూపిస్తూ.

వెంటనే శరభయ్యకు వ్రాశాడు పెండ్లి అవుసరమనీ, లేకపోతే వుద్యోగం హుళక్కనీ. "ఏమో! పిల్ల అదృష్టమేనా వుంటే, దానికి సుఖ పడే గీతుంటే, అబ్బాయి అదృష్టం ఆరు గుఱ్ఱాలబగ్గి యెక్కి నిట్టనిలువుగా నిలబడ గూడదా?" అని ఓ శుభముహూర్తాన్ని ఓ ఇంటి పిల్లని జూసి ముడెట్టేడు శరభయ్య. ఆ రాత్రే పెంచలానికి ఓ విచిత్ర కలొచ్చింది. తాను బొల్లిగిత్తగా మారినట్లూ, తన పెళ్ళాం ఒంటెద్దు బండి కాడి, తన మెడ మీద వేసి, పట్లా అమర్చి "నడహే" అంటూ, కొరడాతో బాదినట్లు! తన వీపు చిట్లినట్లు నూ! "అదృష్టంరా, బాబా" అన్నాడు. వెంటనే, అపసుపు బట్టల తోనే మద్రాసు ప్రయాణమై వెళ్ళి, ఆకంపెనీ యజ

మానురాల్ని కలుసుకొని తాను గృహస్థుడైనట్లు తెలియబరిచాడు. ఆమె నవ్వింది. "ఖాళీ సంపూర్తి" అంది, పెదవి విరచి. మొహం తేల వేశాడు పెంచలు.

పెంచలం దీనుడయ్యాడు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టూ——ఇక్కడికే పితృదేవతల్ని పోషించలేక యేడుస్తూంటే, పైగా పెళ్ళాం దేవత ఒహటా? అనుకొన్నాడు. పోనీ, యీ దీనాలాపాలన్నా విని యే మహానుభావు డన్నా కనికరించడా?" అనుకొని కొందరి దగ్గరకు వెళ్ళి "అయ్యా పెళ్ళాం కల వాణ్ణి. ఓ చిన్న వుద్యోగం పారేద్దురూ" అని యాచించ, నిశ్చయించుకొన్నాడు. ఒక రోజున ఓ కంపెనీ డైరెక్టరు దగ్గరకు వెళ్ళి సలాం కొట్టి "సార్" అన్నాడు. ఆయన అది గోల్డుఫ్లేక్ మూడో టిన్ జూట్ మిల్ గొట్టంలా పొగ ఊదేస్తో "ఏమండీ సార్?" అన్నాడు హుషారుగా. "నేను పెళ్ళయిన వాణ్ణండీ..." అన్నాడు వినయంగా. "చాలా మంచిది. మా అభివందనాలు." అన్నాడాయన మొహం చిట్లిస్తూ. "నేను బి.ఎ." అన్నాడు, పెంచలం చేతులు నలుపుకొంటూ. "అయితే, సిగరెట్ కాల్చండి." అంటూ, పెట్టె అందించాడు పెద్ద మనిషి వినయ పూర్వకంగా. "కనికరించాలి" అన్నాడు దీనుడు. "అది దేవుడి పెత్తనం!" అన్నాడు, డైరెక్టరు. "ఓ చిన్న ఉద్యోగం..." అన్నాడు. "ఖాళీ వుంటే, స్త్రీ పురుషాదులు ఇరవై మందున్నారు రిట్రెంచిమెంటులో లాగి వేసిన బాపతు" అన్నాడు వుద్యోగి. "సెలవు" అన్నాడు, పెంచలు. "మంచిది" అన్నాడు, సిగరెట్ వెలిగిస్తూ విలాస పురుషుడు.

పెంచలానికి యీ నెలతో ఇరవై అయిదో యేడు సంపూర్తి అవుతుంది. విసుగూ విరామం లేకుండా, నాలుగు రెకమెండేషన్లతో గాలిస్తోన్నాడు సివిల్ కోర్టులన్నీని. ఎక్కడా, చీమ దూరేందుకైనా ఖాళీ కన్పించలా. చిట్ట చివరికి, ఓ క్రిష్టయన్‌కు మాత్రం ఛాన్సు వుందన్నారు. తిరిగిందిరా సుడి!" అని, వెంటనే చర్చికి వెళ్ళి క్రిష్టియన్ మతము పుచ్చుకొన్నాడు. ఇదిగో ఆ పనికి నేనే అభ్యర్థి నని ధరకాస్తు ధాటీగా పంపాడు. మూడో రోజు టపా కెదురు చూస్తున్నాడు, వచ్చింది కవరు. చించాడు ఆతృతగా. "క్రిష్టయన్ ఖాళీ పూర్తి మహమ్మదీయునికి మాత్రం ఒహటి ఖాళీగా వుంది." అదీ సమాచారం. శిరం వంచాడు. "రామదేవా అనాలో "క్రీస్తుదేవా" అనాలో తెలియ లేదు. ఆలానే సేరగిల బడ్డాడా పోస్టాఫీసు గోడకు.

పెంచలం వెంటనే "లా" కాలేజిలో చేరి, రెండేళ్ళలో బి.యల్. బిరుదం సంపాదించాడు. పెంటపాడులో ప్రాక్టిస్ పెట్టాడు. శరభయ్య తన కొడుకు రాబడి చూసి సంతోషించక పోయినా, వాళ్ళ ఇంటి ముందు ఆ తెల్లగోడ మీద వ్రేలాడగట్టిన నల్లబోర్డును చూసి, సంతోషించే వాడు. పెంచలావు మాత్రం కోర్టుకు వెళ్ళేటప్పుడూ, కోర్టునుంచి వచ్చేటప్పుడూ——ఆ తెల్ల గోడ మీద తన పేరిట కట్టిన నల్ల బోర్డును చూసి "సేవకా వృత్తికంటే స్వాఛ్ఛంద వృత్తే మేలు!" అనుకొంటూ మనసును సంతృప్తి పరచుకొనే వాడు.

——:o:——

ప్రశస్తమయిన లేనువేసిన ధోవతులు, మధుర ఉత్తరీయములు

కేశవరాం అండ్ కంపెని

1/287, ఎస్ప్లనేడ్ రోడ్డు, మదరాసు

మంచి సరకు

వెల సరసము